విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

సైదాపూర్, మార్చి17: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని వెన్కేపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్యాల గాంధీయాదవ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి గ్రేస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సతీశ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టోర్నమెంట్‌లో విన్నర్‌గా జనగాం టీం, రన్నరప్‌గా శివరాంపల్లి టీం నిలువగా, బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి , బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు చంద శ్రీనివాస్, ఎంపీటీసీ ఓదెలు, నాయకులు అనగోని వీరన్నగౌడ్, మునిపాల రవి, కూతురు విద్యాన్‌రెడ్డి, ఏరుకొండ సుధీర్, పైడిపల్లి రవీందర్, కొత్త మధుసూదన్‌రెడ్డి, మాదం స్వామి, సర్దార్, మహేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణారావు

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 17: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి వీరమల్ల వెంకటరమణారావు పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా కార్యనిర్వాహకవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కట్టా రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి వెంకటరమణా రావుతో పాటు రాష్ట్ర కార్యదర్శి వేణు కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతి రావు, జిల్లా, మండల బాధ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బొట్ల రామస్వామి, సంపత్‌కుమార్, శ్రీనివాసరాజు, పవన్ కుమార్, కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడిగా విద్యాన్‌రెడ్డి

సైదాపూర్, మార్చి17: సైదాపూర్ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కూతురు విద్యాన్‌రెడ్డిని నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పొడిశెట్టి కొమురయ్య, కార్యదర్శిగా పైడిపల్లి రవీందర్ గౌడ్, కోశాధికారిగా అనగోని వీరన్నగౌడ్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ పటిష్టానికి పాటుపడతామన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, మార్చి 17: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత తిరిగి యథావిధిగా నిర్వహిస్తామని, జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్ టౌన్/ వీణవంక, మార్చి 17: నేటి నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. హుజూరాబాద్ మండలంలో మొత్తం 837 మంది రెగ్యులర్, 33 మంది ప్రైవేట్ విద్యార్థులకు గానూ ఐదు సెంటర్లను ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి కేతిరి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. వీణవంక మండలంలో మొత్తం 315 మంది పదో తరగతి విద్యార్థులకు గానూ వీణవంక, ఘన్ముక్ల, చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ వెల్లడించారు.

మహిళా కమిషన్ చైర్మన్ నియామకంపై హర్షం

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 17: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద గౌడ్ నియామకంపై కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 17: నగరంలోని 11కేవీ శక్తి టెంపుల్ ఫీడర్‌లో సోమవారం కొత్త డీటీఆర్, ఏబీ స్విచ్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యూ లేబర్ అడ్డ, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రాంతం, శివ థియేటర్, భాగ్యనగర్, జ్యోతినగర్, సంతోష్‌నగర్, విద్యానగర్, చైతన్యపురి ప్రాంతాలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

ఇల్లందకుంట, మార్చి 17: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన కంచం హరీశ్ (32) పనుల కోసం ట్రాక్టర్‌పై జమ్మికుంటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇల్లందకుంటలో ప్రమాదవశాత్తు కంకర కుప్ప ఎక్కించాడు. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా హరీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కాగా, 108 అంబులెన్సులో జమ్మికుంట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అలాగే, హరీశ్ మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం జమ్మికుంట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

WANTED
jobs

★KNR సుభాష్‌నగర్‌లోని పుల్లెల హాస్పిటల్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ (డిగ్రీ & కంప్యూటర్ నాలెడ్జ్), ఫార్మాసిస్ట్, డిఫార్మసీ/బీఫార్మసీ, నర్సింగ్ స్టాఫ్ (ANM/GNM) కావలెను. స్వయంగా సంప్రదించగలరు.
NTK-317415

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బల్దియా ఉద్యోగోన్నతుల్లో గందరగోళం

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

- మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌కు పలువురి ఫిర్యాదు
- న్యాయం చేయాలని కోరుతున్న సిబ్బంది

కార్పొరేషన్, మార్చి 17: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఉద్యోగోన్నతుల కల్పన, విధుల కేటాయింపు విషయంలో ఆయా విభాగాల అధికారుల ఇష్టారాజ్యం అన్నట్లుగా సాగుతున్నది. అర్హత లేకున్నా తమ వారు అనుకుంటే చాలు మంచి పోస్టు అప్పగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకే స్థాయిలోని సిబ్బందికి కొందరికి కార్యాలయంలోని విధులు అప్పగిస్తుండగా... మరికొందరికి క్షేత్రస్థాయిలో పనులు కేటాయించడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. తమ వారికి మంచిపోస్టులు ఇప్పించి, మిగిలిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పలువురు సిబ్బంది రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరో వైపు కారుణ్య నియామకాల విషయంలో ఉన్నతాధికారులు తమకు నచ్చినట్లుగా పోస్టింగ్ ఇవ్వడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను సిబ్బంది కోరుతున్నారు.

కారుణ్య నియామకాల్లో ఇష్టారీతి

నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాలపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఈ నియామకాలు ఆయా సమయాల్లో ఉన్నతాధికారుల ఇష్టారీతి అన్నట్లుగా మారుతున్నదని బల్దియా సిబ్బంది వాపోతున్నారు. దీంతో తాము ఉద్యోగోన్నతులు పొందే విషయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎనిమిదేళ్ల క్రితం నాటి ఉన్నతాధికారులు కారుణ్య నియామకాల్లో డిగ్రీ, పీజీ చేసిన వారికి అటెండర్ స్థాయిలోనే పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం వచ్చిన అధికారులు మాత్రం ఆయా అభ్యర్థుల విద్యార్హత స్థాయిని పరిగణనలోకి తీసుకొని జూనియర్ అసిస్టెంట్ పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పుడు కల్పిస్తున్న ఉద్యోగోన్నతుల్లో తాము అన్యాయానికి గురవుతున్నామని గతంలో కారుణ్య నియామకాల్లో పోస్టింగ్ పొందిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు ఇటీవల రాష్ట్ర మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా తమ నియామకాలు చేసే సమయంలో అన్ని అర్హతలున్నా, బల్దియాలో ఖాళీలు ఉన్నా కూడా రోస్టర్ రిజిస్టర్ లేదన్న కారణంతో అటెండర్ పోస్టింగ్స్ ఇచ్చారని, అనంతరం జరిగిన కారుణ్య నియామకాల్లో మాత్రం జూనియర్ అసిస్టెంట్ స్థాయి పోస్టులు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో తమకు ఎలాంటి ఉద్యోగోన్నతులు రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కొంత మంది ఇటీవల ఇతర రాష్ట్రాలకు చెందిన డిగ్రీ పట్టాలను సమర్పించి ఉద్యోగోన్నతులు పొందినట్లు విమర్శించారు. నిబంధనల మేరకు ఇతర రాష్ట్రాల డిగ్రీలు చెల్లకపోయినా కూడా పలువురు అధికారులు తమ ఇష్టం వచ్చినట్లుగా ఉద్యోగోన్నతులు ఇస్తున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

విధుల కేటాయింపులోనూ అదేతీరు

నగరపాలక సంస్థలో సిబ్బందికి విధుల కేటాయింపుల్లోనూ ఇష్టారాజ్యం అన్నట్లుగానే సాగుతున్నది. ముఖ్యంగా ఒకే స్థాయి సిబ్బందికి విధులు కేటాయించే విషయంలో తమవారికి అనుకూలమైన పోస్టింగ్ ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. బిల్ కలెక్టర్ స్థాయిలో ఉండాల్సిన వారికి ఆర్ఐ పోస్టు ఇస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వార్డు ఆఫీసర్లుగా నియామకమైన వారు ముడుపులు ఇస్తే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు కేటాయిస్తుండగా... ఇవ్వని వారికి క్షేత్రస్థాయిలో పనులు ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఉద్యోగోన్నతుల విషయంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వీటన్నింటిపై రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయంలో రీజినల్ డైరెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో పూర్తి వివరాలు తెలిపినట్లు సమాచారం.

దేశ చరిత్రను అధ్యయనం చేయాలి

మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

కమాన్‌చౌరస్తా, మార్చి 17: భారతదేశ చరిత్రను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రజ్ఞాభారతి, జాతీయ సాహిత్య పరిషత్, సమాచార భారతి సంయుక్తంగా నిర్వహించిన 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథన్ సంయుక్తంగా రాసిన 'స్నేక్స్ ఇన్ ది గంగ' గ్రంథాన్ని డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి తెలుగులో గంగలో విషనాగులు పేరిట ప్రభావవంతంగా అనువదించారని, ఇది ప్రతి భారతీయుడు చదువదగ్గ పుస్తకమన్నారు. ప్రజ్ఞా భారతి చైర్మన్ డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో పుస్తక రచయిత డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, అతిథులు బూర్ల దక్షిణామూర్తి, వడ్డి విజయసారథి, రాంపల్లి మల్లికార్జున్, మండల నగేశ్ రెడ్డి, గాజుల రవీందర్, తడిగొప్పుల శంకరయ్య, సత్యనారాయణ రెడ్డి, వెచ్చ మురళి, కడార్ల విమల్‌కుమార్, గంగాధర్, శ్రీకర్, పద్మశ్రీ, నీలగిరి అనిత, ఆదిమూలం విద్యాసాగర్, ఉట్కూరి రాధాకృష్ణ, తిరుపతి రావు, రమేశ్ రెడ్డి, డాక్టర్ భాగ్యరెడ్డి పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 17: హోలీ పండుగ సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఈనెల 30వ తేదీ వరకు ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై 40 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు ధరించి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

కార్పొరేషన్లుగా మార్చాలి

తెలంగాణచౌక్, మార్చి 17: బీసీ కులాల కోసం ఏర్పాటు చేసిన ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్లను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతి కార్పొరేషన్‌కు రూ. వంద కోట్లు కేటాయించాలన్నారు. కులగణన చేయడానికి రూ. 150 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకలను ప్రారంభిస్తున్న పాఠశాల చైర్మన్, డైరెక్టర్లు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పారమిత పాఠశాల వార్షికోత్సవం

కమాన్‌చౌరస్తా, మార్చి 17: మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో 'వికసిత' పేరిట రెండు రోజులు నిర్వహించిన వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. వేడుకలను పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వీయూఎం ప్రసాద్, హన్మంతరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందడం అభినందనీయం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నుస్తులాపూర్‌లో వారాహి డిజిటల్ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మార్చి17: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వారాహి డిజిటల్ ల్యాబ్‌ను ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ-డాక్టర్ అనురాధ దంపతులు ప్రారంభించారు. ల్యాబ్ నిర్వాహకులు బామండ్ల భరత్, బామండ్ల ప్రకాశ్, గాజుల అనిల్, అజయ్‌ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొత్త రాజిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, నాయకులు బుదారపు శ్రీనివాస్, కొండాల్ రావు, చిరంజీవి, మాచర్ల అంజయ్య, వరాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

హుజూరాబాద్ టౌన్ మార్చి17: ఎస్‌బీఐ లైఫ్ 'స్మార్ట్ స్కాలర్' పాలసీదారు చెల్పూర్ గ్రామానికి చెందిన అనుమాండ్ల భాస్కర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి కుటుంబానికి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఆదివారం ఎస్బీఐ లైఫ్ హుజూరాబాద్ కార్యాలయ మేనేజర్ సుధాకర్ అందజేశారు. ఎస్‌బీఐ లైఫ్ పాలసీదారులకు మెరుగైన సేవలందిస్తున్నదని, దురదృష్టవశాత్తు ఎవరైనా పాలసీదారు మృతి చెందితే వారి కుటుంబానికి అండగా ఉంటుందని మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఏజెన్సీ మేనేజర్ విష్ణువర్ధన్, అడ్వైజర్ మేకల అరవింద్, మృతుడి సతీమణి అనుమాండ్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

పురుషుల పొదుపు సంఘం వార్షిక మహాసభ

హుజూరాబాద్ టౌన్, మార్చి17: పట్టణంలో హుజూరాబాద్ మాధవ పురుషుల పొదుపు సంఘం పదో వార్షిక మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా తొర్రి రవి తిరిగి ఎన్నికైనట్లు పొదుపు సమితి అధ్యక్షుడు గోపు అజయ్‌కుమార్ ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన ఆరుగురు సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కులను అందించారు. ఉపాధ్యక్షులు కార్తీక్, రాజు, ప్రవీణ్, స్వామి, అశోక్, మల్లయ్య, భరత్, రాజేంద్రప్రసాద్, ఎం నరేశ్, గణకులు మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి

చిగురుమామిడి, మార్చి 17: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో విస్డమ్ హైస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఐ బండి రాజేశ్, పాఠశాల కరస్పాండెంట్ సంధ్య-సంపత్, ప్రిన్సిపాల్ నెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, ట్రస్మా గౌరవాధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, అధ్యక్షుడు సంజీవ రెడ్డి, సమ్మయ్య, మల్లికార్జున్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చట్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఇంట్లో తనిఖీలు

సోదాలు చేస్తున్న అధికారులు

రాంనగర్, మార్చి 17: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడంతో పాటు బాధితుడి భూమిని ఆక్రమించిన కేసులో కరీంనగర్ జైలులో రిమాండ్‌లో ఉన్న తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను శనివారం ఉదయం పోలీసులు కోర్టు అనుమతితో 48 గంటలు కస్టడీకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్‌లోని శ్రీనివాస్ ఇల్లు, గెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆదివారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల తన మరో ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. అక్కడ కూడా కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

విజయవంతంగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స

మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్ రావు

విద్యానగర్, మార్చి 17: కరీంనగర్‌కు చెందిన బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధుడికి చేసిన ఉచిత మోకీలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపులకు చెందిన భూమయ్య(85) పదేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదించగా శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఈ క్రమంలో తెలిసిన వారి ద్వారా కరీంనగర్‌లో బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావును సంప్రదించి కుటుంబ పరిస్థితిని వివరించారు. దాంతో హెల్త్ ఫౌండేషన్ ద్వారా శస్త్రచికిత్స చేయించడానికి ముందుకు వచ్చి కరీంనగర్‌లోని మహవీర్ దవాఖాన చైర్మన్ డాక్టర్ శివకుమార్‌ను సంప్రదించారు. డాక్టర్ సమ్మతితో 20 రోజుల క్రితం భూమయ్య దవాఖానలో అడ్మిట్ కాగా, డాక్టర్ శివకుమార్ పరీక్షలు నిర్వహించి వారం రోజుల తేడాతో రెండు మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ సహకారంతో రూ.5 లక్షల విలువైన మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను ఉచితంగా చేశారు. ఆదివారం భూమయ్యను డిశ్చార్జి చేయగా, డాక్టర్ బీఎన్ రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ బీఎన్ రావు మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30 మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ అలీం, మహవీర్ దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

విద్యానగర్, మార్చి 17: భాగ్యనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో సంఘం 56వ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి 56వ డివిజన్ ఇన్‌చార్జి, పద్మశాలీ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు తెల్ల చంద్రశేఖర్, వెల్దండి కనకయ్య, ఎలిగేటి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం డివిజన్ అధ్యక్షుడిగా అరుకాల సురేశ్, గౌరవాధ్యక్షుడిగా వంగర రవీందర్, ప్రధాన కార్యదర్శిగా గ్యాజంగి మురళీ, కోశాధికారిగా అల్స మహేందర్, ఉపాధ్యక్షులుగా కట్ల ఆనందం, గోరిట్యాల సత్యనారాయణ, అన్నం శంకర్, బైరి రాంప్రసాద్, అంకారపు కైలాసపతి, గౌరవ సలహాదారులుగా బొమ్మకంటి వెంకటేశ్వర్లు, అయిట్ల వీరేశం, కస్తూరి రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులుగా బోగ భాస్కర్, గ్యాజంగి నర్సయ్య, గుర్రం భూమేష్, అలవాల ఆంజనేయులు, గౌడ రమేశ్, పచ్చునూరి నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కర్నాల జగన్‌మోహన్, ప్రచార కార్యదర్శిగా గాలిపెల్లి జగదీశ్ ఎన్నికయ్యారు.

నేటి నుంచి ఒంటిపూట అంగన్‌వాడీల నిర్వహణ

కలెక్టరేట్, మార్చి 17: జిల్లాలో అంగన్‌వాడీలు సోమవారం నుంచి ఒంటి పూట మాత్రమే విధులు నిర్వహించనున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కేంద్రాలు పని చేయనున్నాయి. ఈమేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతివెస్లీ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటల్లోగా ప్రీ స్కూల్ కార్యకలాపాలతో పాటు లబ్ధిదారులకు ఆహారం పంపిణీ పూర్తి చేసి, వారిని ఇండ్లకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే 31 వరకు కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని సూచించడంతో, జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు విధిగా ఉదయం 8 గంటల నుంచే పనిచేయాలని, ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు ఉత్తర్వులకనుగుణంగా వ్యవహరించాలని జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రిటైర్డ్ ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న మెడివిజన్ కంటి దవాఖాన వైద్యులు, సిబ్బంది

హుజూరాబాద్ టౌన్, మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్, జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 102 మందికి హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ కంటి దవాఖాన డాక్టర్ దీప్‌సింగ్ పరీక్షలు చేశారు. తొమ్మిది మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించి, హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌పాసా, కార్యదర్శి విష్ణుదాసు గోపాల్‌రావు, ప్రచార కార్యదర్శి గంజి జయవర్ధన్, ట్రెజరర్ కోయల్‌కార్ దుర్గాజీ, ఉపాధ్యక్షుడు పీ గణపతిరెడ్డి, కమిటీ సభ్యులు పీ లక్ష్మీనారాయణ, కే శ్రీహరి, కాంతమ్మ, జిల్లా కార్యదర్శి కొమురవెల్లి సత్యనారాయణ, కంటి దవాఖాన టెక్నీషియన్స్ వాసు, సంతోష్, ఆర్గనైజర్స్ ఉదయ్, ఖలీద్ పాల్గొన్నారు.

చాకుంటలో వైద్య శిబిరం

విజయకేతనం చూపిస్తున్న ఫార్చ్యూన్ మెడికేర్ దవాఖాన చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి, తదితరులు

విద్యానగర్, మార్చి 17: చొప్పదండి మండలం చాకుంట గ్రామాన్ని కరీంనగర్‌లోని ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యం దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా దవాఖాన చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో పాఠశాల పునర్నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 200 మంది గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

వీణవంక/ మానకొండూర్ రూరల్/గన్నేరువరం, మార్చి 17: వీణవంక, మానకొండూర్, గన్నేరువరం మండలాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి, మక్క, పొద్దుతిరుగుడు చేలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కొండపల్కలలో 20 ఎకరాలకు పైగా వరి చేలు నేలకొరిగాయి. మామిడి కాయలు పిందె దశలో ఉండగా, నేల రాలాయి. గన్నేరువరంలో పిడుగు పడడంతో రామచంద్రం గౌడ్ చెందిన గెదే మృతి చెందింది. కాగా, గన్నేరువరం మండలంలో మక్క 165 ఎకరాలు, వరి 145, పొద్దుతిరుగుడు 20 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఏవో కిరణ్మయి తెలిపారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.